క్లుప్తంగా

1442 మందికి వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: ప్రతి 2 నెలలకోసారి ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూలులో నిర్వహించే దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం వైద్య సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తామని క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. ఆదివారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 1442 మందికి ఉచితంగా వైద్య సేవలను అందించినట్లు తెలిపారు. బీపీ, షుగర్, గుండెజబ్బులు, పక్షవాతం, ఫిట్స్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు స్పెషలిస్టు వైద్యుల బృందం సేవలను అందించిందని, 110 మంది వలంటీర్లు పనిచేశారని చెప్పారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ మోడల్ పరీక్ష



చీమకుర్తి టెన్త్ మోడల్ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

చీమకుర్తి: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో టెన్త్ మోడల్ పరీక్ష నిర్వహించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పరీక్ష పేపర్లతో నిర్వహించారు. పదో తరగతి పరీక్షల పట్ల భయాందోళనలు పోగొట్టడం, విద్యార్థులకు ప్రాక్టీస్ కోసం దోహదపడుతుందని ఎస్ఎఫ్ఐ నాయకులు దేవరాజు ధీమా వ్యక్తం చేశారు. చీమకుర్తిలో నిర్వహించిన రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 220 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు పొదిలి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న దేవప్రభాకర్

పొదిలి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో స్థానిక గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌కే ఐమన్, ఎస్‌కే హిఫ్జా, కె.ఈశ్వర్ జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానం పొందడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరికి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. చైర్‌పర్సన్, కరస్పాండెంట్ కె.భాగ్యలక్ష్మి, జేవీవీ కార్యదర్శి దేవప్రభాకర్ మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని లక్కవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని ఎస్సై వైవీ రమణయ్యకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి 46 మద్యం బాటిళ్లు పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఏడుకొండలు షాపులో 8 బాటిళ్లు, దేవెళ్ల రమణమ్మ ఇంట్లో 38 బాటిళ్లు రైడ్ చేసి పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.
ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు, పోలవరం, వేములబండలో అమ్ముతున్న 49 అక్రమ మద్యం బాటిళ్లను ఎస్ఐ యూవీ కృష్ణయ్య ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పసుపుగల్లులో కాకునూని ఏడుకొండలు వద్ద 17, పోలవరంలో కొణతం అక్కిరెడ్డి వద్ద 25, వేములబండలో దిగుడు తిరుపతిరావు వద్ద 7 మద్యం బాటిళ్లను షాపుల్లో విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకుని బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్ వెళ్లి బాధితురాలికి పింఛన్ అందజేస్తున్న బాలకృష్ణ

పుల్లలచెరువు: పుల్లలచెరువుకు చెందిన బత్తుల రమణ ఆరోగ్యం బాగ లేకపోవడంతో హైదరాబాద్‌లోని వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకుంది. రమణకు పింఛన్ ఇవ్వాలని వలంటీర్ మాలపాటి బాలకృష్ణ రమణ ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు ఆమె గురించి తెలిపారు. వెంటనే బాలకృష్ణ తన సొంత ఖర్చులు పెట్టుకుని హైదరాబాద్ వెళ్లి వైద్యశాలలో ఉన్న రమణకు పింఛన్ అందజేశారు. కేవలం ఆదివారం చివరి తేదీ కావడంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వెళ్లి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు, రమణ కుటుంబ సభ్యులు బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

పండగ వేళ ఆటాపాట!

- ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర
- మండల స్థాయిలో 291 మంది క్రీడాకారులు
- 10 నుంచి మండల స్థాయి పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కొత్తపట్నం: సంక్రాంతి వచ్చిందంటే పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంటుంది. జనవరి 10 నుంచి పల్లెల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తారు. వలసపోయిన కూలీలు ఇంటికి వస్తుంటారు. అందులో భాగంగా వివిధ రకాల ఆటల పోటీలు జరగడం ఆనవాయితీగా వస్తోంది. వారం రోజులు పాటు ఆనందంగా గడుపుతారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను పండగ సమయంలో పెట్టడంతో క్రీడాకారులు, ప్రేక్షులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో బహుమతులు ఇవ్వడాన్ని అభినందిస్తున్నారు.

10న మండల స్థాయిలో..

గత నెల ప్రారంభమైన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ఈ నెల 6తో ముగిశాయి. మండలంలో 15 గ్రామ సచివాలయాలుండగా క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాట్‌మెంటన్ పోటీల్లో 1,544 మంది పాల్గొన్నారు. ఇందులో 15 గ్రామ పంచాయతీలో విన్నర్‌గా 87 టీంలు, రన్నర్‌గా 87 టీంలు వచ్చాయి. ఉమెన్స్‌లో విన్నర్స్‌గా 59, రన్నర్స్‌గా 58 టీంలు వచ్చాయి. వీరంతా మండల స్థాయి పోటీలో పాల్గొననున్నారు. మండల కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో క్రికెట్, ఖోఖో, వాలీబాల్ బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బ్యాట్‌మెంటన్ చెరుకూరి వీరరాఘవరావు ఇండోర్ కోర్టులో నిర్వహించనున్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత పర్యవేక్షించారు.

వైభవంగా సుదర్శన లక్ష్మీనరసింహ యజ్ఞం



యజ్ఞ క్రతువులో టీటీడీ వేద పురోహితులు



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: సుదర్శన లక్ష్మీనరసింహ యజ్ఞం క్రతువును తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ సలహాదారులు రాజేష్ కుమార్ భట్టర్ ఆధ్వర్యంలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఒంగోలు పీవీఆర్ గర్ల్స్ హై స్కూల్ ఘడియారం వారి వీధిలో వేంచేసి ఉన్న అనంత కోదండరామ స్వామి మందిరం దీనికి వేదికైంది. ధనుర్మాసం సందర్భంగా ప్రాతఃకాలంలో రామ మందిరంలో గోదాదేవి ఇరవై రెండో పాశురం అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ శర్మ గోదాదేవికి అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించి అనంతరం కోదండరామ స్వామి దివ్య మంగళ హారతులతో దర్శనం కల్పించారు. ఉదయం తొమ్మిది గంటలకు రామ మందిరం ఎదురు మండపంలో ఉత్సవ మూర్తులు అనంత కోదండ రామున్ని లక్ష్మణమూర్తిని సీతాదేవిని వస్త్రాలంకరణ గావించి వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణతో సుదర్శన లక్ష్మీనరసింహ యజ్ఞక్రతువులో బ్రహ్మగా కూర్చున్నారు. ముందుగా మంగళ ధ్వని విష్వక్సేన పూజ నిర్వహించారు. గూడ రామ్మోహన్ రావు దంపతులు, శిద్దా హనుమంత రావు దంపతులు రుత్విక్ కరణంలో పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారు. ఒంగోలు నగర కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు సివిల్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు మహంకాళి వెంకట శేషయ్య, ఉప కార్యదర్శి భీమ శంకర శాస్త్రి, కార్యవర్గ సభ్యులు మైనంపాటి సాయికుమార్ ఆలయ ధర్మకర్తలు ఘడియారం సుబ్బయ్య శర్మ అర్చకులు రాము శర్మ ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత బాలకృష్ణమ్మ



బాలకృష్ణమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి: ఉపాధ్యాయ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత దివంగత మార్పు బాలకృష్ణమ్మ అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కేవీజీ కీర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలకృష్ణమ్మ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీజీ కీర్తి మాట్లాడారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసులు, వి.బాలాజీ, బి.వెంకట్రావు, కె. వెంకటేశ్వరరావు, సీనియర్ కార్యకర్తలు బి.రంగారావు, కె.రవీంద్రరావు, కె.నాగరాజు, ఎస్. చెన్నయ్య, సత్యనారాయణ, రాజశేఖర్, రంగయ్య శెట్టి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



వాగులో పడిపోయిన మోటార్ బైక్ రిక్షా

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని పాపాయిపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై ఆదివారం జరిగింది. చిన్నపాటి ప్లాస్టిక్ సామాన్లు, గాజులు అమ్ముకునేందుకు రిక్షాకు మోటార్ బైక్‌ను ఏర్పాటు చేసుకుని దర్శిలోని పుట్టబజార్‌కు చెందిన ఎం.కొండయ్య పొదిలి వైపు వెళ్తున్నాడు. పాపాయిపల్లె సమీపంలో వాగుపై ఏర్పాటు చేసిన చప్టాపై అదుపు తప్పి వాగునీటిలో పడిపోయాడు. కొండయ్య చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చెంచు గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బలిజేపల్లి గిరిజన గూడెం చెంచు గిరిజనులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో గూడెంలోని 25 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో చలి తీవ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో చెంచు గిరిజనులకు రాజస్తాన్ దుప్పట్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ట్రస్ట్ రాష్ట్ర సభ్యులు తన్నీరు బాల రంగారావు, వలంటీర్ బాలరాజు నాయక్ పాల్గొన్నారు.

కోనపల్లె ఫారెస్ట్‌లో బెల్లం ఊట ధ్వంసం



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న సీఐ, ఎస్సై

బేస్తవారిపేట: మండలంలోని కోనపల్లె అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై కంభం సీఐ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేశారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో నాటుసారా అమ్మకం, కోడి పందెం, పేకాట ఆడే వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని సీఐ కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఎస్సై బి. నరసింహారావు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి వెండి శంఖం బహూకరణ



వెండి శంఖాన్ని అందిస్తున్న శ్రీనివాస్ దంపతులు

మార్కాపురం: పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెండి శంఖాన్ని అల్లంపల్లి శ్రీనివాస్ దంపతులు ఆదివారం బహూకరించారు. ఆలయంలో పూజల అనంతరం వెండి శంఖాన్ని ఆలయ కార్యదర్శి రమేష్‌కు అందజేశారు.

నలుగురు జూదరుల అరెస్టు

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులోని భగత్‌సింగ్ కాలనీలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. అలాగే కందుల మల్లారెడ్డి కాలనీలో అక్రమంగా మద్యం అమ్ముతున్న కాశీ విశ్వనాథ్‌ను అరెస్టు చేసి ఆరు క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కురిచేడు మండలంలో..

కురిచేడు: మండలంలోని ఆవులమంద, నాంచారపురం గ్రామాల పరిధి పొలాల్లో పేకాట ఆడుతున్న వారిని ఎస్ఐ దేవకుమార్, సెబ్ ఎస్ఐ మారం శ్రీధర్‌బాబులు తమ సిబ్బందితో దాడి చేసి ఆదివారం అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం అకస్మాత్తుగా దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రూ.6830లను, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ దేవకుమార్ తెలిపారు.

కోడిపందెం ..

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి పంచాయతీ దొండపాడు పొలాల్లో కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సైదుబాబు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి కోడి పందేలు ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని 10 కోళ్లు, 23 బైకులు, 11 సెల్ ఫోన్లు, రూ.17,450 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి సోమవారం దర్శి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో
అధ్యయన ఉత్సవాలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి, శ్రీ రామానుజచార్యులవారికి అధ్యయన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకే స్వామివారికి పంచామృతాభిషేకాలు, పంచామృత స్నానం, తోమాల సేవలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, పలువురు ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

21న దేశభక్తి, దైవభక్తి పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు మెట్రో: లలిత కళల ద్వారా సమాజ హితం కోసం కృషి చేస్తున్న అఖిల భారత సంస్థ సంస్కార భారతి అని ఒంగోలు శాఖ అధ్యక్షుడు పత్తి రంగమన్నార్ అన్నారు. ఈనెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం, జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో దేశభక్తి, దైవభక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈనెల 21వ తేదీ ఆదివారం అంజయ్య రోడ్డులోని ఏకేవీకే (ఆంధ్రకేసరి) జూనియర్ కాలేజీ ఆవరణలో పలు పోటీలు నిర్వహిస్తామన్నారు. చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు, బృందగాన పోటీలు, కవితల రచన పోటీలు, శ్రీరాముని వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరపత్రాలను మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, కోటి మాల్స్ అధినేత కోటి సూర్యనారాయణ, సంస్కార భారతి సంరక్షకులు చదివాది హనుమంతరావు, సృష్టి ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు తిమ్మిరి రవీంద్ర, ఎయిమ్స్ క్లబ్ పూర్వ జాతీయ అధ్యక్షులు రాధా రమణ గుప్త జంధ్యం, ఆంజనేయ ప్రసాద్, షణ్ముఖ సాయి తదితరులు పాల్గొన్నారు. పోటీలకు సంబంధించి పూర్తి వివరాల కోసం పత్తి శ్రీనివాసులు (9492123822) పప్పుల హరిప్రియ (7382707546)ను సంప్రదించాలని కోరారు.

విశ్వసనీయతకు మారుపేరు రామ్‌రాజ్



షోరూంను ప్రారంభిస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: వస్త్ర ప్రపంచంలో విశ్వసనీయతకు మారుపేరుగా రామ్‌రాజ్ పేరొందిందని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. పట్టణంలో రామ్‌రాజ్ వస్త్ర దుకాణాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మి జ్యోతి వెలిగించారు. టీటీడీ బోర్డు సభ్యుడు, జ్యోతి గ్రానైట్స్ ఎక్స్‌పోర్ట్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శిద్దా సుధీర్ మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ...కాటన్ ధోతీలు, చొక్కాల తయారీలో రామ్‌రాజ్ తన ప్రత్యేకతను నిలుపుకుందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి కాపాడేలా యాంటీ బ్యాక్టీరియల్ దుస్తులను రూపొందించిందని తెలిపారు. మహిళల కోసం , పిల్లలు, వృద్ధుల కోసం అనువైన దుస్తులను విక్రయిస్తుందన్నారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి విద్యార్థులతో నాటి గురువులు

ఒంగోలు టౌన్: వారంతా 50 ఏళ్ల క్రితం ఒంగోలులోని డీఆర్ఎంఎం మున్సిపల్ హైస్కూలులో 10వ తరగతి చదువుకున్నారు. ఆ తరువాత జీవిత ప్రయాణంలో ఊరు వదిలి, వాడ వెళ్లి పోయారు. ఉన్నత చదువులు అభ్యసించి వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇప్పుడు వారంతా కలిశారు. చిన్న పిల్లల్లా తరగతి గదులన్నీ తిరిగారు. అరేయ్ ఒరేయ్ అంటూ సంతోషంగా గడిపారు. 1974 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఆనాటి ఉపాధ్యాయులుగా పనిచేసి విశ్రాంత సైన్స్ ఉపాధ్యాయులు రామ్మోహనరావు, ఇంగ్లిష్ మాస్టర్ కె. కోటేశ్వరరావు, క్రాఫ్ట్ మాస్టర్ పి.నాగేశ్వరరావు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులతో ఆనాటి సంగతులను నెమరు వేసుకొని ఉద్వేగానికి గురయ్యారు. ఆనాటి విద్యాబోధన గురించి చర్చించుకున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. ఆనాడు తాము చదువుకున్న పాఠశాలలను చూస్తుంటే తిరిగి పాఠశాలలో చేరాలనిపిసస్తుందని పలువురు వ్యాఖ్యానించడం విశేషం. అలాగే తమ బాధ్యతగా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటరావు, కారుమూడి ఆంజనేయులు, దండు అంజిరెడ్డి, సిరాజ్, అచ్చుకోలు శంకర్, మల్లి, భవనం సుబ్బారెడ్డి, గోలి వెంకటరావు, కారుమూడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆనాడు తమకు చదువులు చెప్పి తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను సన్మానించారు. 2025లో పాఠశాల 100 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగూర్ మీరావలి గంధ మహోత్సవం



గంధ గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కురిచేడు: శ్రీనాగూర్ మీరావలి గంధ మహోత్సవం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకతీతంగా నిర్వహించే ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆట గుర్రంపై గంధాన్ని ఉంచి గ్రామోత్సవం చేశారు.